సాక్షి
ఏలూరు
గురువారం । 9 । జనవరి । 2025



మావుళ్లమ్మ హుండీ లెక్కింపు

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ దేవస్థానం ఆదాయం 36 రోజులకు రూ.22,06,667 లభించింది. బుధవారం ఆలయ హుండీలను లెక్కించారు.



ధనుర్మాస పూజలు

పాలకొల్లు సెంట్రల్: శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో బుధవారం స్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు.



హుండీ ఆదాయం రూ.8 లక్షలు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 48 రోజులకు రూ.8,81,748 ఆదాయం లభించింది.

వైకుంఠ ద్వార వైభవం

- ద్వారకాతిరుమలలో సర్వం సిద్ధం
- నేడు మధ్యాహ్నం 3 గంటల నుంచి గిరి ప్రదక్షిణ
- రేపు ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం
- నిజరూపంలో దర్శనమివ్వనున్న స్వామివారు



దర్శనం క్యూలైన్ల వద్ద ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శన స్వాగత ద్వారం

ద్వారకాతిరుమల: శ్రీవారి గిరి ప్రదక్షిణ, అలాగే ఉత్తర ద్వార దర్శనానికి ద్వారకాతిరుమల దివ్య క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ రాజగోపురాలు, పరిసరాలు విద్యుద్దీప కాంతులీనుతున్నాయి. ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అదనపు సిబ్బందితో క్షేత్ర పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు జరిపించారు. భక్తులు, గోవింద స్వాముల పాదాల రక్షణ కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో గడ్డిని పరిచారు. దారిపొడవునా విద్యుత్ లైట్లు, సేదతీరేందుకు షామియానా పందిళ్లను నిర్మించారు. ఈ వేడుకలో స్వామివారు కొలువుదీరనున్న ధర్మప్రచార రథాన్ని పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఇదిలా ఉంటే శ్రీవారి గిరి ప్రదక్షిణ వేడుక స్వామి వారి పాదుకా మండపం వద్ద గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి శ్రీవారి ఉత్తర ద్వార దర్శన భాగ్యం భక్తులకు కలగనుంది.

గిరి ప్రదక్షిణ జరిగేదిలా..

ముందుగా ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఇన్చార్జి ఈఓ వేంద్ర త్రినాధరావు తదితరులు పాదుకా మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి, జెండా ఊపి గిరి ప్రదక్షిణ వేడుక ప్రారంభిస్తారు. ఈ యాత్ర మల్లేశ్వరం (దొరసానిపాడు రోడ్డు) మీదుగా గిరి చుట్టూ తిరిగి కొండపైన ఆశ్రమం వద్దకు చేరుతుంది. అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా ఆలయానికి చేరుకుంటుంది. 5 కిలోమీటర్ల మేర సాగే ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు మధ్యలో మంచినీరు, పండ్లు, అల్పాహారాలు, టీలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆంబులెన్స్, నడవలేని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఉచిత బస్సును ఏర్పాటు చేస్తోంది.

అత్యవసర ఎగ్జిట్ గేట్లు : క్యూలైన్లలో ప్రతీ 30 అడుగులకు ఒక అత్యవసర ఎగ్జిట్ గేటును ఏర్పాటు చేశారు. అడుగడుగునా మంచినీటి సౌకర్యం, అల్పాహారం, స్నాక్స్ అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రథమ చికిత్సా కేంద్రాన్ని అనివేటి మండపం వద్ద ఏర్పాటు చేశారు.

ఉత్తర ద్వార దర్శనం ఇలా..

- ఉచిత దర్శనం చేసుకునేవారు, రూ.100, రూ.200, రూ.500 టికెట్ల ద్వారా వెళ్లే భక్తులు ఆలయ తూర్పు ప్రాంతంలోని సప్తగోకులం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ల ద్వారా, ఉత్తర రాజగోపురం లోంచి ఆలయంలోకి ప్రవేశిస్తారు.
- నిత్యార్జిత కల్యాణంలో పాల్గొన్న భక్తులు పడమర రాజగోపురం పక్కనున్న ప్రత్యేక క్యూలైన్ ద్వారా, ఉత్తర రాజగోపురం లోంచి ఆలయంలోకి వెళ్తారు.
- వీఐపీలు, వీవీఐపీలు, గోవింద స్వాములు, స్థానిక భక్తులు నూతనంగా నిర్మించిన క్యూకాంప్లెక్స్, అనివేటి మండపం మధ్యలోంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా, దక్షిణ రాజగోపురంలోంచి ఆలయంలోకి వెళ్తారు.
- దర్శనానంతరం భక్తులు ఆలయం లోంచి తూర్పు రాజగోపురం మీదుగా బయటకు వెళ్తారు. పడమర రాజగోపురంలోంచి అర్చకులు, పండితులకు మాత్రమే ప్రవేశం.



ముస్తాబైన ఉత్తర ద్వారాలు



శ్రీవారి ధర్మప్రచార రథం

వైభవంగా నిర్వహిస్తాం

శ్రీవారి వైభవాన్ని చాటేలా గిరి ప్రదక్షిణ, శుక్రవారం ఉత్తర ద్వార దర్శనాన్ని నిర్వహిస్తాం. గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు, గోవింద స్వాములు పాల్గొననున్నారు. ఉత్తర ద్వార దర్శనానికి 30 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం.

– వేంద్ర త్రినాథరావు, దేవస్థానం ఈఓ

● సంక్రాంతి సందడి షురూ



నిత్యం ప్రభుత్వ కార్యాలయాల్లో పని ఒత్తిడిలో మునిగితేలే ప్రభుత్వ ఉద్యోగులు ముందే సంక్రాంతి సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. ముగ్గులు, భోగి మంటల చుట్టూ తిరుగుతూ ఉల్లాసంగా గడిపారు. ఏలూరు ఇరిగేషన్ అతిథి గృహంలో జిల్లా ఎన్జీవో సంఘం ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో మహిళా ఉద్యోగులు రంగవల్లుల పోటీల్లో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి

ఏలూరు(మెట్రో): రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్కు తరలించే వారిపై ఉక్కుపాదం మోపాలని సీఎం ఆదేశించారన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా మరింత నిఘా పెట్టి అక్రమార్కులపై 6ఏ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కేసులు నమోదు చేయడంతో పాటు నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటే వ్యవస్థలో భయం ఉంటుందన్నారు. పౌర సరఫరాలు, పోలీసు, తూనికలు కొలతల శాఖల అధికారులు కలిసికట్టుగా ప్రతీవారం దాడులు నిర్వహించాలని, చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కె.సత్యనారాయణరాజు, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జగన్‌ను కలిసిన జేపీ



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జయప్రకాష్

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ముందుస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై పార్టీ అధ్యక్షుడికి వివరించారు. పార్టీ కార్యకర్తలతో నిత్యం మమేకమవుతూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనలో పేదవర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు భరోసా కల్పిస్తూ రాబోయే కాలంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లోకి వచ్చేందుకు సన్నద్ధం అవుతున్నారని జేపీ తెలిపారు.

దేహదారుఢ్య పరీక్షలకు 459 మంది హాజరు



అభ్యర్థులకు పరుగుపందెం

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ కొనసాగుతుంది. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో బుధవారం దేహదారుఢ్య పరీక్షలకు అభ్యర్థులు హాజరయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 600 మంది పురుష అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు జారీ చేశారు. ఎంపిక పోటీలకు 459 మంది హాజరుకాగా.. వారిలో 313 మంది ఎంపికైనట్లు ఎస్పీ శివకిషోర్ చెప్పారు. అభ్యర్థులు ఎంపిక పోటీలకు హాజరయ్యే సమయంలో తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో రావాలని ఆయన తెలిపారు.

రోడ్లు, మంచినీటి పథకాలపై సమీక్ష



జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారుల పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ చెప్పారు. బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి సంఘం సమావేశం జరిగింది. ఆర్అండ్‌బీ రహదారుల పురోగతి, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం కింద అమలు చేస్తున్న మంచినీటి పథకాల ఏర్పాటు, ఇరిగేషన్‌కు సంబంధించి కాల్వలకు నీటి విడుదల వంటి అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాసరావు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పత్సమట్ల ధర్మరాజు, బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు.

32 మంది పోలీస్ సిబ్బందికి బదిలీలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న 32 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆయా స్టేషన్లల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. బదిలీ చేసిన వారిలో ఏఎస్సై, పది మంది హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లు, 18 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో రూ.97 కోట్లతో చేపట్టిన ఆర్అండ్‌బీ రహదారుల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. బుధవారం జెడ్పీ స్థాయి సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతలు రహిత ఏలూరు జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కోరారు. కీలకమైన ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారులతోపాటు మరికొన్ని రహదారుల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు.

'తల్లికి వందనం' అమలు చేయాలి



జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. సమాఖ్య ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు, ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తల్లికి వందనం హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఈ విద్యా సంవత్సరానికి అమలు చేయలేనని చెప్పడం సరైన విధానం కాదన్నారు. వెంటనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈ.శివకుమార్, ఎం.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

ఏలూరు టౌన్: హ్యూమన్ మెటాఫ్ న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతానికి రాష్ట్రంలో ఎలాంటి కేసులు నమోదు కాకున్నా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఏలూరు జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు తెలిపారు. 22 బెడ్లతో కూడిన వార్డును సిద్ధం చేశామని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగానే వార్డును ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

ఇసుక అందుబాటులో ఉంచేలా చర్యలు

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ప్రజలకు ఉచిత ఇసుక మరింత అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత దృష్టిలో ఉంచుకుని, అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. ఉచిత ఇసుకకు ఎలాంటి కొరత లేకుండా ప్రజలకు డిసిల్టింగ్ పాయింట్లలో ఉచిత ఇసుక అందుబాటులో ఉంచేందుకు అధికారులు పరిశీలించాలన్నారు. ఏలూరు జిల్లాలోని గూటాల-1, గూటాల -2, పట్టిసీమ డీసిల్టింగ్ పాయింట్లలో ఇసుకను అందుబాటులో ఉంచడంతోపాటు, తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని చిడిపి, ఔరంగాబాద్ ఇసుక రీచ్‌ల ద్వారా ఇసుక సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందన్నారు.

● నిర్లక్ష్యంతో నిరుపయోగం

కదిలే సంజీవనిగా పేరుగాంచిన 108 అంబులెన్స్‌లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఎందరో ప్రాణాలు కాపాడిన ఈ అంబులెన్స్‌లకు మరమ్మతులు వస్తే బాగు చేయించకుండా మూలన పడేస్తున్నారు. ఎంతో విలువైన అంబులెన్స్‌లు నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారిపోతున్నాయి. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కనిపించిన ఈ దృశ్యం అందుకు నిదర్శనం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



సీతాల్.. గురక చేపకు చెక్

- ఆక్వాలో శత్రు చేపలను భక్షించే చేప
- చైనా గురక చేప గుడ్లు స్వాహా
- బంగ్లాదేశ్ నుంచి కొల్లేరుకు చేరుతున్న చేప సీడ్





పట్టుబడి సమయంలో లభించిన సీతాల్ చేపతో ఆక్వా రైతు రంగరాజు, సీతాల్ చేప పిల్లలు (సీడ్)

కైకలూరు: పైరులో కలుపు మొక్కల నివారణతో దిగుబడి పెరుగుతోంది. అదే విధంగా ఆక్వా చేపల చెరువుల్లో సీతాల్ చేపలతో దిగుబడులు పెరుగుతాయి. సీతాల్ చేపలు చెరువుల్లో మేతలను హరించే గురక జాతి చేప గుడ్లను, హాని కలిగించే ఇతర జీవులను తినేస్తాయి. లక్షల్లో పెట్టుబడుల పెట్టి సాగు చేస్తున్నా రైతులు రోజు వారీ చేపల చెరువుల్లో వాడే మేతలను కాపాడుకోడానికీ సీతాల్ చేపలు సాయపడుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో 1.25 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఏటా 4.50 లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తున్నారు. దాదాపు రూ.20 కోట్లపైనే టర్నోవర్ ఉంది. దేశంలోనే ఆక్వా ఉత్పత్తులలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. అందులోనూ సింహభాగం కొల్లేరు ప్రాంతం నుంచి చేపల ఉత్పత్తి అవుతోంది. ఈ చేపల సాగులో తెల్ల చేపలకు తోడు చైనా గురక పెరుగుతోంది. సాగు చేపలకు వేసిన తవుడు, చెక్క వంటి మేతలను ఇవి తినేస్తున్నాయి. గురక చేపల సమస్యను నివారించడానికి సీతాల్ చేపలను రైతులు చెరువుల్లో వదులుతున్నారు.

ఏమిటీ సీతాల్.. సీతాల్ మాంసాహారి చేప. దీనినే చిటలా, సీతాల్, చిటోల్, కత్తిచేప అని పిలుస్తారు. ఇండియన్ ఫెదర్ బ్యాక్, ఇండియన్ నైట్ ఫిష్ అనే పేర్లు కూడా ఉన్నాయి. బంగారు, వెండి రంగుల్లో ఉంటూ పైన నల్లటి చారలు ఉంటాయి. నాలుగు అడుగుల వరకు పెరిగి 5 నుంచి 6 కేజీల బరువు ఉంటాయి. బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్ సమీప బ్రహ్మపుత్ర, సింధు, గంగానది, మహానంది నదుల్లో కనిపిస్తాయి. పురాణేతిహాసాల ప్రకారం హిందూమతంలో మహావిష్ణువు అవతారాల్లో ఒకటిగా ఈ చేపకు స్థానం ఉంది. మత్స్యావతారంలో విష్ణువు రాక్షసుడిని కత్తి ఆకారం కలిగిన ఈ చేపతోనే సంహరించినట్లు భావిస్తారు.

సీతాల్‌తో ఉపయోగాలు

బెంగాల్ ప్రాంతం నుంచి సీతాల్ చేపల సీడును తీసుకొస్తున్నారు. నాలుగు అంగుళాల చేపను రూ.25 నుంచి రూ.30కు విక్రయిస్తున్నారు. ఎకరం చేపల చెరువులో సీతాల్ పిల్లలను 30 నుంచి 50 విడిచిపెడుతున్నారు. వీటిలో కొన్ని మరణించినా కనీసం 25 చేపలైన జీవిస్తున్నాయి. సీతాల్‌లు గుడ్లు పెట్టవు. మాంసహారులు కావడంతో పెంపకం చేపలకు వేసిన తవుడు, చెక్కలను ఇవి తినవు. గురక చేపల గుడ్లను వెంటనే తినేస్తాయి. చిన్న గురక పిల్లను వేటాడతాయి. ఒక్కో రైతు ఒకే చెరువులో నాలుగేళ్ళు సీతాల్ చేపలను పెంచవచ్చు. పట్టబడి సమయంలో ఈ చేపలను బయటకు తీసి విక్రయిస్తే మంచి గిరాకీ ఉంటుంది. సీతాల్ చేప మార్కెట్‌లో కేజీ రూ.350 నుంచి రూ.400 కొనుగోలు చేస్తారు. కొవ్వుతో కూడిన మాంసంతో సీతాల్ రుచికరంగా ఉంటుంది.

సీతాల్ సీడ్‌కు గిరాకీ



చేపల చెరువు సాగులో సీతాల్ చేపలను వదలడం వల్ల గురక చేప వ్యాప్తిని నివారించవచ్చు. బెంగాల్ నుంచి సీతాల్ సీడ్ వస్తోంది. సమీప ఏలూరు నుంచి తీసుకొచ్చి విక్రయిస్తాం. సైజను బట్టి ఒక్కో చేప పిల్ల రూ.30 పలుకుతుంది. ప్రస్తుతం చైనా గురక విపరీతంగా పెరగుతోంది. వీటిని నివారించడానికి సీతాల్ చేప సీడ్‌కు డిమాండ్ ఏర్పడింది.

– మంగినేని రామకృష్ణ, సీడ్ సరఫరా వ్యాపారి, కైకలూరు

చేపల రైతులకు నేస్తం



చేపల రైతులకు మంచి నేస్తంగా సీతాల్ చేప ఉంది. రూ.లక్షలు వెచ్చించి మేతలు వేస్తుంటే చైనా గురక చేపలు తినేస్తోన్నాయి. దీంతో సాగు చేపలకు మేత తగ్గుతోంది. సీతాల్ చేపలు గుడ్డు దశలోనే వాటిని తినేస్తున్నాయి. చేపల చెరువుల్లో పట్టుబడి చేసినప్పుడు కావాలంటే వీటిని మళ్ళీ చెరువులో వదిలిపెట్టవచ్చు. ఇతర చేపల గుడ్లు తినడం వల్ల సీతాల్ చేప మరింత రుచిగా ఉంటుంది.

– దండు రంగరాజు, చేపల రైతు, కైకలూరు

టీడీపీ నేత ఫ్యాక్టరీకి సిమెంట్ రోడ్డు

ఉపాధి నిధులు దుర్వినియోగం



కొత్తరావిచర్లలో టీడీపీ నాయకుడి ఫ్యాక్టరీ వద్దకు వేస్తున్న సిమెంట్ రోడ్డు

నూజివీడు: పేదలకు, కూలీలకు ఏడాదిలో వంద రోజుల పనిని కల్పించాల్సిన ఉపాధి హామీ పథకం దుర్వినియోగం అవుతోంది. ఏలూరు జిల్లా నూజివీడు మండలం కొత్తరావిచర్లలో ఊరి బయట తోటల్లో ఉన్న ఓ టీడీపీ నాయకుడి ఫ్యాక్టరీ వద్దకు ఉపాధి హామీ పథకంలో సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. రూ.15 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో అవసరమైన చోట సిమెంట్ రోడ్డు నిర్మాణాలు చేయాల్సి ఉండగా ఊరి బయట తోటల మధ్యలో ఉన్న ఫ్యాక్టరీ వద్దకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. అధికారులు ఇలా ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం చేయడం సమంజసం కాదంటున్నారు.

క్లుప్తంగా

సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక



రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు కళ్యాణి

దెందులూరు: పుదుచ్చేరిలో ఈ నెల 20 నుంచి 25 వరకు జరిగే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కి ఏలూరు జిల్లా దెందులూరు ఉన్నత పాఠశాల బోటని ఉపాధ్యాయురాలు బీఎస్ఎన్‌కే కళ్యాణి ఎంపికయ్యారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ఉపాధ్యాయుల విభాగంలో ఉపాధ్యాయురాలు కళ్యాణి వైద్య, వ్యవసాయ, ఆహార పరిశోధన రంగాలకు దోహదపడే విధంగా ఎక్స్‌ట్రాక్షన్ ఆఫ్ డీఎస్ఏ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. దీంతో ఆమెను సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కి ఎంపిక చేస్తూ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి ఉన్నతాధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ ఉపాధ్యాయురాలు కళ్యాణిని అభినందించారు.

ఏలూరు ఏరువాక కేంద్రానికి బెస్ట్ డాట్ సెంటర్ అవార్డు



బెస్ట్ డాట్ సెంటర్ అవార్డును అందుకుంటున్న ఫణికుమార్

ఏలూరు(మెట్రో): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2023–24 సంవత్సరానికి గాను వ్యవసాయంలో రైతులకు అందించిన సేవలకుగాను ఏలూరు ఏరువాక కేంద్రానికి బెస్ట్ డాట్ సెంటర్ అవార్డు లభించింది. ఆచార్య ఎన్.జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన 54వ ఆర్ఈఏసీ మీటింగ్‌లో ఈ అవార్డును ప్రకటించారు. ఏఎన్‌జీఆర్ఏయూ ఉపకులపతి డాక్టర్ శారద జయలక్ష్మి, ఏపీ వ్యవసాయ కమిషనర్ అండ్ డైరెక్టర్ డా.ఢిల్లీరావు చేతుల మీదుగా ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.ఫణికుమార్ అవార్డు అందుకున్నారు. విశ్వ విద్యాలయ పరిశోధన సంచాలకులు డా. పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డా.జి.శివన్నారాయణ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయస్థాయి సెమినార్



జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: గోపన్నపాలెంలోని శ్రీసీతారామా ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన 'అథ్లెటిక్స్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్' జాతీయస్థాయి సెమినార్ బుధవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్‌గా చీఫ్ కోచ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డాక్టర్ వినాయక ప్రసాద్, ప్రిన్సిపాల్ ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సూరంపాలెం, డాక్టర్ ఎస్.సరోజి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సీబీఐటీ హైదరాబాద్ నుంచి డాక్టర్ రాజు హాజరయ్యారు. అథ్లెటిక్స్‌లోని మెలకువలపై విద్యార్థులకు వివరించారు. ముగింపు సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియేల్ అధ్యక్షత వహించారు.

నిలిచిన సదరం క్యాంపులు

- పింఛన్ల తనిఖీ పేరిట సదరం నిలిపివేసిన ప్రభుత్వం
- ఏప్రిల్ వరకు సదరం క్యాంపులు లేనట్టేనా?
- కొత్త పింఛన్ల కోసం దివ్యాంగుల ఎదురుచూపులు



భీమవరం ప్రభుత్వాసుపత్రి



ఆకివీడులో పింఛన్లు తనిఖీ చేస్తున్న డాక్టర్లు, అధికారులు

భీమవరం (ప్రకాశం చౌక్): సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే ప్రజలకు గత ప్రభుత్వంలో అందించిన అనేక పథకాలు దూరం చేయగా తాజాగా పింఛన్లలో కోత విధించేందుకు సిద్ధమైంది. పింఛన్ల తనిఖీ పేరిట దివ్యాంగులను సైతం ఇబ్బంది పెట్టేందుకు చంద్రబాబు వెనుకాడడం లేదు. పింఛన్ల తనిఖీ పేరిట సదరం క్యాంపులను ఈనెల 1వ తేదీ నుంచి నిలిపివేయడం జరిగింది. దీంతో దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు సదరం సర్టిఫికెట్ అందుకుని పింఛన్ పొందే అవకాశం దూరం కానుంది. దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రభుత్వం నుంచి పింఛన్ సాయం పొందాలంటే ముందుగా సదరం ధ్రువీకరణ పత్రం పొందాలి. ఇందుకోసం ప్రభుత్వం సదరం క్యాంపులు నిర్వహిస్తుంటుంది. సదరం సర్టిఫికెట్ ఉంటే నెలకు వారికి రూ.6 వేలు నుంచి రూ.15 వేలు పింఛన్ అందుతుంది. అయితే ప్రస్తుతం పింఛన్ల తనిఖీ పేరిట సదరం క్యాంపులు నిలివేసింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు మళ్లీ సదరం క్యాంపులు ఉండవని తెలుస్తోంది. దీంతో వందలాది మంది దివ్యాంగులకు నూతన పెన్షన్లు అందుకోవడంలో ఆలస్యం ఏర్పడనుంది. కూటమి ప్రభుత్వ తీరుతో కొత్త పింఛన్ల కోసం ఎంతగానో ఎదురుచూస్తున్న దివ్యాంగులు ఉసూరుమంటున్నారు.

జిల్లాలో పింఛన్ల తనిఖీలు

జిల్లాలో రూ.10 వేలు, రూ.15 వేలు పింఛన్ (డీఎంహెచ్ఓ పెన్షన్స్)ల లబ్ధిదారులను తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో 1510 డీఎంహెచ్ఓ పెన్షన్లు ఉన్నాయి. వాటి తనిఖీలకు విజయవాడ నుంచి ఆరుగురు డాక్టర్ల బృందం వచ్చి స్థానిక వైద్యారోగ్యశాఖ, డీఆర్‌డీఏ అధికారులతో కలిసి పెన్షన్లు తనిఖీ చేస్తున్నారు. దాని వల్ల జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరం క్యాంపులు నిలిపేశారు. ఈపెన్షన్ల తనిఖీలు పూర్తి చేసిన తర్వాత జిల్లాలోని 25 వేల వరకు ఉన్న దివ్యాంగులు (రూ.6 వేలు) పెన్షన్లు తనిఖీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా సదరం క్యాంపులు వివరాలు
జిల్లా ఆస్పత్రి తణుకులో:
ఆర్థోపెడిక్, కళ్లు, ఈఎన్‌టీ, మానసిక
భీమవరం ఏరియా ఆస్పత్రి:
ఆర్థోపెడిక్ (ఎముకలు)
తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి: ఆర్థోపెడిక్
ఆకివీడు ఏరియా ఆస్పత్రి : ఆర్థోపెడిక్

స్లాట్ బుక్ చేసుకున్నవారి పరిస్థితి ఏంటి

సదరం సర్టిఫికెట్ కోసం దివ్యాంగులు ఈఏడాది మార్చి నెల వరకు సదరం స్లాట్‌ను వార్డు, గ్రామ సచివాలయం ద్వారా బుక్ చేసుకున్నారు. అయితే ప్రస్తుతం సదరం క్యాంపులు నిలిపివేయడం వల్ల స్లాట్ బుక్ చేసుకున్న వారి పరిస్థితిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఏప్రిల్ వరకు వారికి సమయం ఉంటుందా.. లేక మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాలో తెలియని పరిస్థితి.

నెలకి 400 సర్టిఫికెట్ల జారీ

జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఆస్పత్రిల్లో ప్రతి సోమవారం, శుక్రవారం, మంగళవారం నాడు సదరం క్యాంపులు నిర్వహించేవారు. ఆయా క్యాంపులకు ప్రతి వారం 25 నుంచి 30 మందికి పరీక్షలు నిర్వహంచేవారు. దాంతో జిల్లా వ్యాప్తంగా నెలకి 400 వరకు సదరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు.

పింఛన్లలో కోత

గత ప్రభుత్వంలో అర్హులకు ఏడాదికి రెండుసార్లు నూతన పింఛన్లు అందించడం జరిగేది. ఈ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలల పూర్తయినా కూడా కొత్త పింఛన్ల ఊసే లేదు. పైగా ఉన్న పింఛన్లు తగ్గించే పనిలో పడింది. పింఛన్ల తనిఖీలో రకరకాల కారణాలను చూపి పింఛన్లు తొలగించాలని ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. మూడు నెలల పాటు సదరం నిలుపుదల చేస్తే కొత్త పింఛన్లు ఈఏడాదికి కూడా ఇవ్వాలసిన పని ఉండదని భావిస్తుంది. సదరం సర్టిఫికెట్లు ఆలస్యంగా కారణం చూపవచ్చని కుట్రలు చేసి సదరం క్యాంపులు నిలిపేసింది.

కానిస్టేబుల్ అభ్యర్థుల పరుగు పోటీలో అపశ్రుతి



అభ్యర్థిని అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో చేపడుతున్న కానిస్టేబుల్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు నిర్వహిస్తున్న 1600 మీటర్ల పరుగు పోటీలో బుధవారం అపశ్రుతి చోటుచేసుకుంది. పరుగు పోటీలో ఓ అభ్యర్థి కాలు ఆకస్మికంగా కిందపడిపోయాడు. వెంటనే స్పందించిన పోలీస్ అధికారులు అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. పరుగు పోటీల్లో నిర్ణీత సమయానికి లక్ష్యాన్ని చేరుకుంటేనే అర్హత సాధించే అవకాశం ఉండడంతో బ్యాచ్ నెంబర్ 12లో ఏలూరు లంకపేట ప్రాంతానికి చెందిన ఎం.చంద్రశేఖర్ అనే అభ్యర్థి వేగంగా పరుగుపెడుతూ కాలు విరగటంతో కుప్పకూలిపోయాడు. అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో చంద్రశేఖర్‌ను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరుగు పోటీలను పర్యవేక్షిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వెంటనే స్పందిస్తూ సర్వజన ఆసుపత్రికి వెళ్లి బాధితుడ్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈనెల 9వ తేదీన కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు ఆఖరి రోజు అని, ఇప్పటి వరకూ హాజరుకాని ఎవరైనా అభ్యర్థులు ఈ పోటీలకు హాజరుకావచ్చని ఎస్పీ కేపీ శివకిషోర్ స్పష్టం చేశారు.

ఎకో జోన్ వద్దంటూ నిరసన



ఆకివీడులో కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా చేస్తున్న ప్రజలు

ఆకివీడు: ప్రజల కొంప ముంచే కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆకివీడు మండల ప్రజలు, నాయకులు స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశాన్ని నాయకులు, ప్రజలు, రైతులు తీవ్రంగా వ్యతిరేకించి సమావేశం ముందు బైఠాయించారు. ధర్నా చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యం, 120 జీవో వల్ల తీవ్రంగా నష్టపోయామని, జిరాయితీ రైతులకు నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదని వాపోయారు. ఎకో జోన్ వల్ల 10 కిలోమీటర్ల దూరం వరకూ ఏ విధమైన ఫ్యాక్టరీల నిర్మాణం, కట్టడాలు జరగవని దీనివల్ల గ్రామాలకు గ్రామాలు వలసలు పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంట పొలాలు నష్టపోయామన్నారు. నష్టపరిహారం ఇవ్వాలని, కొల్లేరు కాంటూర్‌ను మూడుకు కుదించాలని, ఎకో జోన్ ప్రస్తావనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ మేరకు తహసీల్దార్, అభయారణ్య రేంజర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఆంజనేయులు, రేంజర్ సెక్షన్ అధికారిణి సుజాత, ఎస్సై హనుమంతు నాగరాజు, నాయకులు మోటుపల్లి ప్రసాద్, జంపన సత్యనారాయణరాజు, సుబ్రహ్మణ్యం రాజు, జేకే, భగవాన్‌రెడ్డి, కనుమూరు రామకృష్ణంరాజు, సర్పంచ్‌లు చిగురుపాటి చిట్టిబాబు, గురువెల్లి అన్నపూర్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఆక్వాకు లైసెన్స్ తప్పనిసరి

- ఆక్వా అనుబంధ పరిశ్రమలకూ లైసెన్సులు పొందాల్సిందే
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



సాగులో ఉన్న రొయ్యల చెరువు

దెందులూరు: ఆక్వా సాగుదారులతోపాటు ఆక్వా అనుబంధ పరిశ్రమల యజమానులు కూడా లైసెన్సులు తీసుకోవాలనే నిబంధనను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్సడా చట్టం–2020 అనుసరించి ఈ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో రైతులు, ఆక్వా అనుబంధ పరిశ్రమల నిర్వాహకులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది.

పథకాలకు లైసెన్సే కీలకం

విద్యుత్ కనెక్షన్ల మంజూరు, వినియోగంపై రాయితీ వర్తింపుతో పాటు చేపలు, రొయ్యల క్రయవిక్రయాలకు లైసెన్సును తప్పనిసరి చేయనున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న పథకాలతో పాటు భవిష్యత్‌లో అమలు చేయబోయే పథకాలకూ ఈ లైసెన్సే కీలకం కానుంది. రానున్న రోజుల్లో బీమా సదుపాయం కల్పించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ లైసెన్స్ తప్పనిసరి. చేపలు, రొయ్యలకు సంబంధించి మేతలు, మందుల దుకాణాల యజమానులు, కొనుగోలుదారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులకు చట్టబద్ధత కల్పించేందుకు లైసెన్స్ తప్పనిసరి చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

ఉమ్మడి జిల్లాల్లో ఆక్వా సాగు వివరాలు	
ఆక్వా సాగు విస్తీర్ణం	2.90 లక్షల ఎకరాలు
చేపల సాగు	1.80 లక్షల ఎకరాలు
రొయ్యల సాగు	1.10 లక్షల ఎకరాలు
కొనుగోలు కేంద్రాలు	120
ప్రాసెసింగ్ యూనిట్లు	30
దుకాణాలు	1500

తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలి



పాత లైసెన్సులతో నిమిత్తం లేకుండా తప్పనిసరిగా లైసెన్సులు పొందాలి. ఆక్వా జోన్ పరిధిలోని దరఖాస్తులకు 6 రోజులు, నాన్ ఆక్వా జోన్‌లో వాటికి 15 రోజుల్లో మంజూరు చేస్తాం. ఒకే చెరువులో ఒకరి కంటే ఎక్కువ మంది ఉంటే అందరి తరపున ఒకటే పొందే వెసులుబాటు కల్పిస్తున్నాం.
– కేఎస్‌వీ నాగలింగాచార్యులు, మత్స్యశాఖ జిల్లా అధికారి

పట్టపగలే భారీ బరులు సిద్ధం



కలిదిండిలో బరుల ఏర్పాట్లలో నిమగ్నమైన కూలీలు



బరులను సిద్ధం చేస్తున్న దృశ్యం

- జూదాలు వద్దని హెచ్చరిస్తున్న పోలీసులు
- పట్టించుకోని కోడి పందాల నిర్వాహకులు

కైకలూరు: జూదాలు వద్దు.. సాంప్రదాయ క్రీడలే ముద్దు.. అంటూ పోలీసులు మొత్తుకుంటున్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చూసినా భారీ బ్యానర్లతో ఆయా గ్రామాల్లో ప్రజలకు పోలీసు సిబ్బంది అవగాహన కలిగిస్తున్నారు. కైకలూరులో అయితే పోలీసుశాఖ ఆధ్వర్యంలో యువత జూదాలకు ఆకర్షితులు కావద్దని క్రికెట్ టోర్నమెంట్ సైతం ఏర్పాటు చేశారు. ఒక వైపు ఇంతలా పోలీసు ప్రచారం జరుగుతున్నా.. మరోవైపు పందాల నిర్వాహకులు పట్టపగలే భారీ బరులను ఏర్పాటు చేస్తున్నారు. కలిదిండి నుంచి భోగేశ్వరలంక వెళ్లే రహదారిలో పంటపొలాల మధ్య భారీగా బరి ఏర్పాటు చేస్తున్నారు. ఇదే కాకుండా ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో సైతం బరులకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో పండగ మూడు రోజులు ముందు బారులు వెలిసేవి. కూటమి ప్రభుత్వంలో నిర్వాహకులు ముందుగానే పందాలకు బరులను సిద్ధం చేసుకుంటున్నారు. కలిదిండిలో ఏర్పాటు చేస్తున్న భారీ బరిపై ఎస్సై వెంకటేశ్వరరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కలుషిత నీటితో పలువురికి అస్వస్థత

పాలకోడేరు: శృంగవృక్షం గ్రామంలో కలుషిత నీరు తాగడం వలన గత నాలుగు రోజులుగా పలువురు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో గ్రామస్తులు బాధపడుతున్నారు. పంచాయతీ ఫిల్టర్ చేయకుండా మంచినీటిని సరఫరా చేస్తుండడం వలనే అనారోగ్యాలు తలెత్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై డీఎంహెచ్ఓ భాను నాయక్‌ను ప్రశ్నించగా గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న మాట వాస్తవమే అన్నారు. తమ సిబ్బంది ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించి మందులు సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం మంగళ, బుధవారాల్లో 7 కేసులు గుర్తించామని, వారికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906. [T-298]

■ కంపోజిటబుల్ క్యారీ బ్యాగ్ వాడదాం 120 రోజుల్లో నీటిలో, మట్టిలో కరిగిపోయే కవర్లు వాడదాం. క్యాన్సర్ నుంచి తప్పించుకుందాం దక్షి కంపోస్టబుల్ క్యారీ బ్యాగ్స్ ✆ 80742 84948 [P-772846]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2589]

సినిమా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

Wanted

■ సెక్యూరిటీ గార్డ్స్ తాడేపల్లిగూడెం – నిడదవోలు మధ్య 12 గం. Duty. Age 50 లోపు, Q: 10th, Urgent ✆ 94917 71179, 94903 80213 [B-807228]

■ కష్టమైనపని కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు – 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD. 6309020999 [HA-99473]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తెలుగు తమ్ముళ్ల రచ్చ

- అక్రమ గ్రావెల్ దందాపై విమర్శలు, ప్రతి విమర్శలు
- నూజివీడు నియోజకవర్గంలో రచ్చకెక్కిన విభేదాలు



నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో గత కొంతకాలంగా మంత్రి పేరు చెప్పుకుంటూ సాగిస్తున్న గ్రావెల్ అక్రమ దందా వ్యవహారంపై గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ రచ్చకెక్కడంతో రాజకీయం వేడెక్కింది. ఒకవైపు మంత్రి కొలుసు పార్థసారథి, మరోవైపు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు కావడంతో ఈ వ్యవహారం ఆసక్తికరంగా మారింది. ఈనెల 4న యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నూజివీడు ప్రాంతం నుంచి అక్రమ గ్రావెల్ లారీలు వస్తున్నాయని మాట్లాడారు. దీంతో నూజివీడుకు చెందిన టీడీపీ నాయకులు దీనిపై తీవ్రంగా విమర్శించారు. మంత్రి నియోజకవర్గం జోలికి ఎమ్మెల్యే ఎందుకు వస్తున్నారంటూ ప్రశ్నించారు. దీనిపై గన్నవరం నియోజకవర్గానికి చెందిన నాయకులు తమ వద్ద ఆధారాలున్నాయని, ముసునూరు మండలం చిల్లబోయినపల్లిలో మూసేసిన క్వారీ పర్మిట్‌లు పెడుతూ గ్రావెల్‌ను పెద్ద ఎత్తున ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొండపర్వ నుంచి టిప్పర్లలో తరలిస్తున్నారని, మమ్మల్ని అక్కడకు వచ్చి ఆధారాలు బయటపెట్టమన్నా పెడతామంటూ సవాలు విసిరారు. దీంతో డిఫెన్స్‌లో పడిన నూజివీడు టీడీపీ నాయకులు ఏం మాట్లాడాలో తెలియక తన పట్టాభూమిలో ఉన్న మట్టిని ఎవరో ఒకరు వచ్చి తోలుకుంటున్నారని, అలాగే లింగమనేని కిషోర్ తోలుకెళ్తూ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు చిల్లబోయినపల్లి గ్రావెల్ క్వారీ పర్మిట్‌లు పెట్టుకోవడం జరిగిందని కొత్తరావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు చెప్పారు. దీనిని బట్టి చూస్తే గన్నవరం టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిజమేనన్న విషయం తేటతెల్లమైంది.

మద్యం సిండికేట్‌లోనూ కీలకపాత్ర

నూజివీడు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన లింగమనేని కిషోర్ ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ పార్టీలో ఉండేవాడు. ఈయన సతీమణి సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తుండగా కిషోర్ అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా అన్ని పార్టీల నాయకులతో సత్సంబంధాలు నెరపుతూ తన పనులను చక్కపెట్టుకుంటాడు. మంత్రి పార్థసారథిని టీడీపీకి నూజివీడు అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ఈయన కూడా పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ తరువాత నుంచి మంత్రికి నియోజకవర్గంలో ప్రధాన అనుచరుడిగా మారిపోయారు. నియోజకవర్గంలో 16 మద్యం షాపులకు గాను ఐదు షాపులు ఈయనకు సంబంధించిన సిండికేట్‌వే కావడం గమనార్హం.

గ్రావెల్ కొల్లగొట్టిన నేతపై ఫిర్యాదు

ముసునూరు మండలం చిల్లబోయినపల్లిలో ప్రభుత్వం అనుమతినిచ్చిన గ్రావెల్ క్వారీలు ఉన్నాయి. ఈ గ్రామం ఏలూరుకు దగ్గర కావడం, దెందులూరు నియోజకవర్గానికి సరిహద్దులో ఉండటంతో అటువైపు ప్రాంతాలకు గ్రావెల్ కావాలంటే ఎక్కువ శాతం చిల్లబోయినపల్లి నుంచే వెళ్తుంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పాతరావిచర్లలో ఉన్న గుమ్మడి గట్టు (బోడి గట్టు) గ్రావెల్ అంతా టీడీపీ నాయకులు కొల్లగొట్టారు. దీనిపై మూడు నెలల క్రితమే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మీకోసం కార్యక్రమంలో సైతం ఫిర్యాదు చేశారు. అలాగే టీడీపీ సోషల్‌మీడియా యాక్టివిస్టులు సైతం గ్రావెల్ కొల్లగొట్టిన నాయకుడిపై పోస్టింగులు సైతం పెట్టారు.

కనసానపల్లిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు

ఇదిలా ఉండగా ఆగిరిపల్లి మండలం కనసానపల్లిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు రెండు నెలలుగా జోరుగా సాగుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఈ వ్యవహారంలో మంత్రి అనుచరులు ఉండటంతో దీని వెనుక మంత్రి పార్థసారథే ఉన్నట్లుగా నియోజవర్గవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని ఆసక్తి పరిణామాలు చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

బ్యాంక్ ఆఫ్ ఇండియా
Bank of India
తణుకు బ్రాంచ్, తణుకు, ప.గో.జిల్లా, ఆం.ప్ర.
ఫోన్ నెం.: 08819-223475. ఈ-మెయిల్: [illegible]@bankofindia.co.in

Ref. No: TNK/GVK/2024-25/01 Date: 07.01.2025

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (6) కి సంబంధించిన నిబంధనతో [illegible] ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 [illegible]

[illegible] రూ.15.09.202.53 పై + 10.45% [illegible] తేది.27-02-2025న [illegible] "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ ఉన్నట్లు" మరియు "ఏలా ఉన్నది అలా" పద్ధతిన విక్రయించబడుతుంది. [illegible]

స్థిరాస్తి వివరములు : ఐటమ్ నెం.1 : [illegible] 291-4-72 [illegible] 1050 [illegible] 102 [illegible]

రిజర్వు ధర రూ.27,62,000/- ధరావతు రూ.2,76,200/-
ఇ-వేలం తేది & సమయం:27-02-2025, ఉ॥ 11 గం॥ల నుండి సా॥ గం॥ 5 ల మధ్య
(ఒక్కొక్కటి 10 ని॥ల ఆటో అపరిమిత పొడిగింపుతో బిడ్డింగ్ పూర్తి అయ్యే వరకు కొనసాగించబడును)

తేది.09-01-2025 మరియు 24-02-2025 వరకు కార్యాలయ పనివేళల్లో సంబంధిత బ్రాంచి అధికారి వారిని సంప్రదించి ఆస్తి తనిఖీ చేసుకొనవచ్చును

[illegible] https://www.ebkray.in [illegible] https://www.bankofindia.co.in/tenders [illegible]

తేది : 08.01.2025 సం/-అధీకృత అధికారి,
ప్రదేశం : తణుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా